గుతో, కరుళ్లు కట్టుతో, ఉవ్వెత్తుగా లేస్తో, ఉరకలువేస్తో మహా నిర్ఘరిణిలా ప్రవహించింది. ఆ మహావాహినిలో ఆమెనీ, నన్నూ, విశ్వాన్నే మరచిపోయాను. కాకుంటే ఆమె జీవితాన్నే నాశనంచేసి ఉండేవాణ్ణి. నేనన్యథా వాంఛించి ఉంటే ఆమె ఈనాడు అతని సరసని కూచొని నన్నలా గర్వంతో అపహాస్యం చేసి ఉండేది కాదు. ఏనాడో నా ద్వేషానలానికి ఇంధనమై పోయి ఉండేది. ఆమెనీ, ఆమె గర్వాన్నీ కూకటివేళ్ళతో పెళ్ళగించి నా ప్రతిక్రియా క్రతువులో హవిస్సునుచేసి వ్రేల్చి ఉండేవాణ్ణి. కాని నేను క్షుద్రుణ్ణి కాలేను. ఆమె నన్ను ప్రేమించనీ, ద్వేషించనీ నాకొక్కటే. నేను మాత్రం నిర్వికల్పంగా ప్రేమిస్తాను.

* * *

ఇది రెండు సంవత్సరాలనాటి కథ. కాలం నా గాయాన్ని మాన్పలేకపోయింది. అది ఈనాటికీ పచ్చిపచ్చిగానే ఉంది. కాని ఇంకెంతకాలం ఉంటుంది?

మొదట్లో ప్రేమ నిష్కామమని నమ్మాను. కాని అనుభవపూర్వకంగా గ్రహించాను అది నిష్కామ మెన్నటికీ కాదని. సుదర్శం కాక పోతే నిర్వీర్యమై నశిస్తుంది కాని స్త్రీ పురుష ప్రేమ ప్రతిఫలాన్ని వాంఛిస్తుంది. అది తీవ్రతరమైతే మంచి చెడ్డ అన్న భేదం విడిచి కార్య సాఫల్యాని- కెక్కు మార్గాల్ని అన్వేషింప జేస్తుంది. దాన్ని జయించటమంటే సాధ్య మయ్యే విషయంకాదు. ఇక అనుక్షణమూ, అహరహమూ, ఈ జీవన్మృత్యు సంగ్రామం సాగించటం సాధ్యమౌతుందా? అసాధ్యమనే నా ఉద్దేశం. కనుకనే ఆత్మాసాంతం రచించ దలచుకొన్నాను. దీన్ని భీరుత్వమను, మరే మన్నా అను.

కాని కడపటి కోరికగా నిన్ను అర్థించే దేమంటే ఇందుతో పంపే జాబుల్ని—అవి ఆమె రాసిన లేఖలు—అవి ఆమెకి చేర్చు. తప్ప కుండా ఆమె నన్ను మరచిపోయి ఉంటుంది. అవి ఇచ్చి, ఆమెసుఖమయ జీవితంలో తుఫాను రేపటం నాకిష్టం లేదు. కాని నన్ను ఆఖరుసారిగా గుర్తు తెచ్చుకొని, జాలితో రెండశ్రుకణాలు తర్పణంగా వీడకలిగితే చాలు. ఇలా అర్థించటానికి నాకేమీ హక్కు లేదు కాని, అర్థిస్తున్నాను... సెలవు."

* * *

సత్యం, కృష్ణవేణివైపు చూచాడు. ఎండి పోయిన కళ్ళను తెరుస్తో కృష్ణవేణి కళ్ళ నీళ్లు తుడుచుకుంటో "ఆ జాబు నేను చదవలేదు కోపంతో చించివేశాను" అంది.

నేటి పరీక్షా రణరంగం

# ఒక రామకార్యం

"సుబ్బన్న"

"ఇదేమిటండీ జనం ఇలా గుమిగూడారు?" అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించారు అమరేంద్ర.

"పరీక్షలు".

"పరీక్షలైతే గుంపుదేనికి?"

"అది ఈ వూరి అలవాటు, మా దేశపుటాచారం."

విస్తుపోయి నాకేసి వింతగా చూశారు అమరేంద్ర. ఇంక వివరాలు విప్పిచెప్పకతప్పిందిగాదు.

"దీన్ని శారదాలయ మంటారు. ఒకప్పుడీ సంస్థ 'ఒహో'యనిపించుకొన్నదే. బాలశారద పరిగంచు పావడాలిచట జీరాడినై. నిండు హృదయాలు 'ఝల్లు' మన ముగ్ధ శారద చిరు గజ్జెలు ఘల్లు మన్నదీ చవికె మీదనే. కవితాకుమారి వన్నెలు దిద్దుకొన్నది. ప్రౌఢ శారద పాండిత్య మొలకపోసింది ఈ చెట్ల నీడల్లో. అయితే... ఇపుడిదో పరీక్షా కదన రంగం. మీరు చూచేదో పద్మవ్యూహం. అదిగో ఆ ఎదురుగా నున్నదే - అదే ప్రేమ ప్రవాహాలు పొంగి ఘనీభవించి రూపొందిన క్రీస్తు దేవుని దేవాలయం. ప్రస్తుతం అదో కర్మాగారం పరీక్షా రణపరికరాలు తయారవుతున్నవాదులో

ఇదిగో వీరిని చూడండి నలభయ్యో పడిలో పడ్డ నాగరికులు. వారి దీక్షా వస్త్రాలను తిలకించారు కదూ! గాంధీ టోపీ, ఖద్దరు లాల్చీ, పేటంచు కండువా, చేతిలో తోలుసంచి, కండ్లకు నీలపుటద్దాలు, వీరు ఈ వూరి పెద్దలు. ఇక్కడ నిలబడి మరీ నడుపుతున్నారు."

"ఏమిటి నడిపేది?"

"అదేనండీ, పరీక్షలు"

"పరీక్షలు నడిపేది ప్రభుత్వం కదూ"

"ఇప్పటి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమేగా, వీరే ఇచటి ప్రజలూ, గ్రామ పెద్దలూను."

"ఆ గుంపేమిటి కోతి మూకలాగ ప్రహరీ పైన, చెట్లమీద?"

"ఒక రామకార్యమనుకోండి ఈ వూళ్ళో పరీక్షలంటే. దీనికి తలలుమార్చే పెద్దలు, పని లేని పిన్నలు, విధిలేని తాలూకాఫీసు గుమాస్తాలు, బ్రతకనేర్చిన కొంతమంది బడిపంతుళ్ళు, నిరుద్యోగులైన పట్టభద్రులు, గాలికితిరిగే కోతి మూక, చకచక నడిచే ఉడుతల దండు-ఇలాటి జీవరాసులన్నీ నడుం గట్టుకుంటాయి."

"ఆ కలకల మేమిటి?"

"ప్రశ్న పత్రం బయటికి వచ్చివేసింది!"

"ఎలాగ?"

"ఇచటి విద్యార్థులు వీరులు శూరులూను. 'హాలు'లోకి వెళ్ళేటప్పుడే వీరు తెల్ల కాగితాలు గులకరాళ్ళు జేబులో వేసుకు వెళుతారు. ప్రశ్న పత్ర మివ్వగానే గబగబా తెల్ల కాగితంపై పది ప్రశ్నలు వ్రాసి దానిలో గులకరాళ్ళు చుట్టి కిటికీలగుండా బయటకు విసురుతారు బయటనున్న వానరమూక తమసహజమైనగల్లంతుతో వాటిని ప్రక్కనున్న పంచల్లోకి, కర్మాగారంగా ఉపయోగపడే ఒకటి 'చర్చి'లోకి చేరవేస్తారు. ఆ పంచల్లోను, క్రీస్తు దేవాలయంలోను అరితేరిన అనుభవశాలులుంటారు. వారు గబగబా తప్పులో ఒప్పులో పుస్తకాలు చూచి ఆ ప్రశ్నలకు జవాబులు చెబుతూంటే, కాలేజీ ఎగగొట్టి ప్రజాసేవ జేయవచ్చిన పరార్థ జీవన సహాయకులు ఒక్కొక్కరు నాలుగేసి 'కార్బను' కాగితాలు పెట్టి చకచకా వ్రాసివేస్తారు. ఇలా తయారైన సామాగ్రి పదిహేను నిమిషాల్లో వానరమూక చేతుల్లోకి కుప్పలు తిప్పలుగా వెళుతుంది వారు ఒక్కొక్క కాగితాన్ని తగుపాటి కంకరరాయికి చుట్టి రివ్వురివ్వున కిటికీల గుండా లోనికి రువ్వుతారు. పరీక్షార్థులు రాళ్లను సేకరించి చూచి, వీలైనంత చురుకుగా వ్రాస్తారు. ప్రత్యక్షంగా మీరే చూడండి. మరొకరు చెప్పటమెందుకు. ఓ పావుగంట మనం ఈ పెద్దల వెనుక నుంచుందాం"

"అయితే లోపల సూపరింటెండెంట్లు ఉండరటండీ?"

"ఉంటారు, రెండు కిటికీలమధ్య నున్న గోడనానుకొని. లేకపోతే వాళ్ళైనా శ్రీకృష్ణ పరమాత్మలా మంధరగిరి నెత్తి ధైర్యంగా నిలబడటానికి."

"ఈ చిన్నకారు దేనికండీ, ఈ వెధవలకి ఓనమాలైనా రావే?"

"అలా అనకండి వాళ్ళది ఉడతాభక్తి. చేతైనంతవరకు వాళ్ళూ చేస్తున్నారు సేవ."

"వీరి భక్తి మెచ్చుకొదగినదండీ, మార్చి నెల మండుటెండలో విధి విరామం లేకుండా రాళ్లవాన కురిపిస్తున్నారు."

"మరి కోరమీసం దువ్వుకొంటూ అచట్టూ నిల్చున్న బురఖా వాలాల- పొరపాటు- మా గ్రామ పెద్దల పట్టుదలనో."

"ఆహా! ప్రశంసింప తగ్గదే వారి చలువేగా? అదేమిటండోయ్ లోపల కలకల మెక్కువైనది? ఈ దారుణ రణరంగంలో ఏ మహారథికుడైనా కైవల్యాన్ని ..."

"భయమక్కరలేదు. ఆ మిలమిల మెరిసే జరీ తలపాగా చూశారూ? వారే సుగ్రీవ మహారాజులుంగారు, ఈ సేవకు నాయకులు. అతి నేర్పుతోనూ ఓర్పుతోనూ సాగిస్తున్నారీ వ్యూహాన్ని. కిటికీలకేదో అధికారు లడ్డుపెడితే ధైర్యసాహసోత్సాహసములు మువ్వురిని పెనగొన ఒక్క దెబ్బన బద్దలుకొట్టించారా అటంకాన్ని. ఆ కలకలానికి కారణమదే."

"ఈ పద్మవ్యూహ మభేద్యంగా నున్నదే!"

"లోపల బద్ధకంకణులైన సుగ్రీవులుంగారు, గోడలపైనా చెట్లపైనా ఆవరణ లోపలా వెలుపలా వానరమూక, వారికండగా నిల్చి సగర్వంగా మీసం దువ్వే బురఖా పెద్దలు, పూనుకొని పనిచేస్తూంటే తిరుగేముందండీ!"

"ఈ మూల వేపచెట్టు కివతలగా ఇదేమిటండోయ్ 'బ్రిడ్జి' కట్టారు, రామరామ స్కూలు బల్లలతోనే!"

"సైన్యాన్ని సులువుగా లోపలికి నడిపించటానికి లెండి."

"మొత్తానికి బ్రహ్మాండంగా వున్నదండీ ఈ పరీక్షా కదనరంగం."

* * *

గంట మ్రోగింది. కలకం మిన్నుముట్టింది. సగర్వంగా బయటికొచ్చే వీరులను వెలుపలనున్న యోధులు ఆనందంతో ఆహ్వానిస్తున్నారు "బాగా అందినవా?" "ఇబ్బంది లేకుండా వ్రాసుకొన్నారా?" అనే పెద్దల పరామర్శలకు జవాబులిస్తూ పరీక్షార్థుల ప్రవాహం సుడులు తిరుగుతోంది. కదను త్రొక్కుకుంటూ ముందుకు సాగిపోతోంది.

కాఫీ హోటలు క్రిక్కిరిసింది. ఆ మూల కొందరు పెద్దలు. ఈ చివర కొత్తగా వచ్చిన కొందరు ఉపాధ్యాయులు. ఆమధ్య తమ బిడ్డలకు అన్ని వసతులూ కల్పించటానికి వచ్చిన తండ్రులు, మద్దత్తుకొచ్చిన కొరడా మనుషులు, విద్యార్థులూ, "మీకెన్నా సార్" అంటూ ఇటునటు తిరిగేసర్వర్లు-అంతా గందరగోళంగా ఉంది. "అదుగో నాన్నా వాడేనన్నా సరిగా కాపీ కొట్టుకోనివ్వలే" దంటూ ఓ విద్యార్థి ఉపాధ్యాయులలో ఒకరివంక వేలెట్టి చూపాడు. చప్పున కళ్ళన్నీ అటు తిరిగినై. "ఏం పంతులూ ఏ వూరు మీ"దన్నాడో బురఖా పెద్ద. "కాపీ ఎందుకు చెయ్యనియ్యలే" దన్నాడు కళ్ళజోడు నాగరికుడు. "వాళ్ళు కాపీ కొడితే నీ సొమ్మేం పడిపోయిం" దన్నాడా బుర్రమీసపుటూసామి. "దేహశుద్ధి కావాలా?" అన్నాడో తొర్రి పెదవుల పెద్ద, చేతులోని తోలు సంచీ వూగిస్తూ. ఉండబట్టలేకపోయినాడాయుపాధ్యాయుడు. "తప్పు". "తప్పొప్పినీకెందుకు? నలుగురితోపాటు నారాయణ" అంటూ శాస్త్రాన్ని తిరగవేశారు పేటుకండువా ఆచార్యులుగారు. చాదస్తపు బడి పంతులు కాకపోతే అంతటితో ఒక నమస్కారం చేసి-వారు పెద్దలు; పిన్నలు పెద్దలకు నమస్కరించటం మనదేశ పుటాచారం, పైగా చక్కని సంస్కృతీగనుక పోరాదూ; పైగా "అవన్నీ తప్పులు, చూచి వ్రాసిన మీ బిడ్డలు దేనికి పనికివస్తారు?" అన్నాడు. సాఫుచేసిన పాగాకు పాయ నోటితో పట్టుకొని మిగత కొడను నలిపి తుంపే మోతుబరి రైతు చప్పునందుకొన్నాడు "అలా గంటయ్యా! ఆ తెలివి నీకే పుట్టిందా అంట." ఫక్కున నవ్వారు పిన్నా పెద్దా అంతా. కందిపోయింది కొత్త మేస్టరుగారి లేత ముఖం. రెండు చేతులతోను 'స్టెతస్కోపును' గుండ్రంగా చుట్టే డాక్టరుగారు, "ఎందుకు పనికొస్తారేమిటి వాళ్ళు మినిస్టర్లుగా పనికొస్తార"న్నారు కనుబొమ్మలు ముడిపెడుతూ. ఆ దెబ్బతో తల క్రిందైన కొత్త మేస్టారు కళ్లు రెండుమార్లు ఆర్పి ఓ గుటక మ్రింగి కొంచెం తెప్పరిల్లి "నిజమేనండీ, నేను తెలియక తప్పు చేశాను క్షమించ"మంటూ తినేతినే నేతి పెసరట్టు నొదిలేసి చక్కాపోయినారు. "వృథాగా చెడగొట్టాడు వెధవ పంతులు కాపీలన్నీ ఇవ్వకుండా. లేకపోతే 80 మార్కులొచ్చే"వన్నాడా పరీక్షార్థి. "ఫరవాలేదు లేవోయ్ అందినంతవరకే చాలు" నన్నాడు ఇంకో పరీక్షార్థి. "మార్కులు చేదా? వచ్చేవాటి నెందుకు చెడగొట్టా"లన్నాడు మూడవవాడు. "మరీ ఇవాళరేపూ గడ్డురోజులండీ - ఇవి గడిస్తే మా వాడికిక ఢోకా లే"దన్నాడు షావుకారు కాపు. "గడ్డాలేదు గిడ్డాలేదు. అడ్డమొస్తే నరికి పారెయ్యం? ఇది పోటుగడ్డ" అంటూ పిడికిలి బిగించి కండరాలను పైకుబికించాడో గాలికి తిరిగే రౌడీ.

చెవులారవిని కన్నులార గాంచిన అమరేంద్ర ఒక్క నిట్టూర్పు పుచ్చి "సంస్థలూ వ్యవస్థలు చక్కగా పనిచేస్తున్న"వన్నారు. కాని బ్రతుకలేని బడి పంతుళ్ళు నలిగిపోతున్నారీ ఘోర పరీక్షా రణరంగంలో. విజ్ఞానాభివృద్ధికని నిర్మించబడ్డ శారదాలయము వ్యూహాలకు కేంద్రమై అవినీతికి నిలయమై పోయింది. ఎక్కడా చెల్లుబడి కాని విద్యార్థులకూ మరోచోట పనికిరాని పంతుళ్ళకూ మాత్రం పట్టుకొమ్మైంది. విద్యావిధానాన్ని సంస్కరించామని వెన్ను విరుచుకొంటున్నారమాత్యవర్యులు. బరువెక్కిన హృదయంతో తల వంచుకొన్నారమరేంద్ర.